ప్రజాశక్తి

ఆదివారం 26 నవంబర్ 2023 | 5 | విజయనగరం

జాతీయ స్థాయి

స్కేటింగ్ పోటీలకు ఫోర్ట్‌సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రూరల్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఇటీవల విశాఖలో నిర్వహించిన స్కేటింగ్ స్టేట్ మీట్‌లో ఫోర్ట్ సిటీ పాఠశాల విద్యార్థి నిత్యప్రియ 5-7 వయసు విభాగంలో రింక్ వన్ అండ్ త్రీలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 6వ తరగతి చదువుతున్న కౌశిక్ 11 ఒక గోల్డ్, 2 కాంస్య పతకాలు సాధించాడు. ఈ విధంగా స్కేటింగ్లో తమ ప్రతిభను కనబరిచిన నిత్యప్రియ, కౌశిక్ డిసెంబరు 14 వతేదీ నుండి 18వ తేదీ వరకు చెన్నైలో జరగబోయే రూరల్ స్కేటింగ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల చైర్మన్ కెఎపి రాజు (శివ), పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమా అభినందించారు.

వేపాడ మండలం పికెఆర్ పురంలో నీటమునిగిన వరిపనలు; తడిచిపోయిన వరిచేలను ఆర బెడుతున్న రైతు

ముంచేసిన వాన

అకాల వర్షాలతో 2వేల ఎకరాల్లో పంట నీటిపాలు

ప్రజాశక్తి -వేపాడ, శృంగవరపుకోట

మొన్నటివరకు తీవ్ర వర్షాభావం... రెండు రోజులుగా అకాల వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేశాయి. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో చిరు జల్లులు, పలుచోట్ల వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరికొద్దిరోజుల్లో ఇళ్లకు చేరాల్సిన పంట నీటి పాలు కావడంతో రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలతో జిల్లాలో సుమారు 2వేల ఎకరాల్లో కోసి ఉంచిన వరిచేలు నీటి పాలయ్యాయి. వేపాడ, శృంగవరపుకోట మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వేపాడ మండలంలో పికెఆర్ పురం, ఎస్ఎస్ఆర్ పురం, అరిగిపాలెం, జాకేరు, వల్లంపూడి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి నీటమునిగింది. శృంగవరపుకోట మండలంలోని వెంకటరమణపేట, బొడ్డవర, జెడ్ కుమరాం, రాజీపోట, కాపు సోంపురం, చినఖండేపల్లి, భవానీనగర్, ముషిడిపల్లి, ఎస్.కోట, కొత్తూరు తదితర గ్రామాల్లో సుమారు 800 వందల ఎకరాల్లో కోసి ఉంచిన వరిచేలు నీట మునిగాయి. వరిపనలు పూర్తిగా మునిగిపోవడంతో వరిచేలు మరి పనికి రాకుండా పోయాయని రైతులు కన్నీరు పెడుతున్నారు. చేతికొచ్చిన పంట నీలు పాలు కావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

సంక్షేమ బోర్డు రక్షణకు ఐక్య పోరాటాలు

భవన నిర్మాణ కార్మికుల మహాసభలో తమ్మినేని సూర్యనారాయణ • సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వం అనుసరిస్తున్న భవన నిర్మాణ కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్మాణరంగ కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల రెండో మహాసభ శనివారం ఉత్సాహంగా జరిగింది. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరటి కట్ల ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సెస్ రూపంలో వసూలు చేస్తున్న డబ్బులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలన్న చట్టం ఉన్నప్పటికీ అలా చేయకుండా టిడిపి అధికారంలో ఉన్నప్పుడు గోదావరి పుష్కరాల కోసం, వైసిపి ప్రభుత్వం నవరత్నాల పథకాలు కోసం ఖర్చు పెట్టడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు వారి సంక్షేమ నిధులను సైతం ఇతర అవసరాలకు మళ్లించి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 27 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి శంకరరావు, కె. సురేష్ మాట్లాడుతూ , భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి అనేక రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల కోసం అనేక పథకాలు పెడుతుంటే మన రాష్ట్రంలో మాత్రం సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా లాక్ డౌన్ ప్రకటించడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడ్డారని, ఇసుక కొరత ఏర్పడి నిర్మాణ రంగ ధరలు అధికంగా పెరిగిపోవడంతో పనులు లేక కార్మికులంతా వలసలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాలు భవనిర్మాణ కార్మిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

సభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న గుర్తింపు కార్డులను, క్లయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయాలని, ధరలు తగ్గించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు పి విశ్వనాథం, ఎం. త్రినాధ రావు, అసిరప్పడు, పారిచర్ల రామారావు, గౌరు నాయుడు, వెంకట నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన భవనిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం మండల నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా పోరెడ్డి విశ్వనాథం, అధ్యక్షులుగా అరటి కట్ల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొడ్రోతు గౌరు నాయుడు, ఉపాధ్యక్షులుగా పారి చర్ల రామారావు, కోశాధికారిగా లొట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కాబోతుల గౌరు నాయుడు వీరితో పాటు మరో 20 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా వ్యాప్తంగా న్యాయ మూర్తులతో శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, యు.దుర్గాప్రసాద్‌ను పలువురు న్యాయ వాదులు కలిసి సత్కరించారు. నూతన కోర్టు భవన సముదాయాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో న్యాయ వాదుల సంఘ కార్యవర్గ సభ్యులు సిహెచ్ దామోదర రావు, విజి సంతోష్ ,అంజని కుమార్ , సీనియర్ న్యాయ వాదులు కెవియన్ తమ్మన్న శెట్టి, బొడ్డు సత్య నారాయణ, ఇనుగంటి సురేష్, ధవళ వెంకట రావు, బివిఅర్‌కె ప్రసాద్, కె.సూర్య ప్రకాష్ తదితరులు ఉన్నారు.

న్యాయమూర్తిని సత్కరిస్తున్న న్యాయవాదులు

కోలగట్లకు అభినందనలు

శిల్పారామం నుండి కోర్టుకు చేరుకోవడానికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్లను న్యాయవాదులు అభినందించారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, బొగ్గులదిబ్బ నిర్వాసితులు

తొలగించిన చోటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రత్యామ్నాయం చూపిస్తామని కమిషనర్ హామీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బొగ్గుల దిబ్బ దళితుల ఇళ్లు తొలగించిన చోటే నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పట్టణాల్లో, నగరాల్లో ప్రభుత్వం భూముల్లో నివాసమున్న చోటే రెగ్యుల రైజ్ చెయ్యాలని జీవో నెంబర్ 60 ఇచ్చిందన్నారు. దీన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. దళితుల ఆత్మ గౌరవం కాపాడేందుకు సిపిఎం ఎప్పుడూ వారికి అండగా ఉంటుందని అన్నారు. హాస్పటల్ ఏరియాలో రోడ్డు పక్కనున్న వారికి జెఎన్‌టియు వద్ద ఇళ్లు నిర్మించి ఇచ్చారని, వారు ఇళ్లల్లో దిగిన తరువాతే వారి ఇళ్లు తొలగించారని తెలిపాడు. అదే పద్ధతి బొగ్గులదిబ్బ దళితులు విషయంలో ఎందుకు పాటించలేదని అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ కోర్టులో ఉన్న 18 ఇళ్లు తొలగించామని అన్నారు. పూర్తిగా ఇళ్లు ఇవ్వని వారికి ప్రత్యామ్నాయం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, కుల వివక్ష నిర్మూలన పోరాట కమిటీ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, బొగ్గుల దిబ్బబాధితులు అప్పల కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నవంబర్ 26న ఈ కార్యక్రమం జరపవలసి ఉండగా, ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గజపతినగరం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పైడితల్లి, శంకర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను చేపట్టారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు చిప్పాడ రమేష్ కుమార్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రాధాన్యతను విద్యార్థులను వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు దేశభక్తి గేయాలకు నృత్య ప్రదర్శన చేశారు. కోలాటం, కర్ర సాము వంటి కళాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కూడా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

విజయనగరం టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా శనివారం నిర్వహించారు. కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సుభ రాజ్యాంగం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ ఉమామహేశ్వరరావు, రాజనీతి అధ్యాపకులు ఇ.దుర్గాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు

జెవివి ఆధ్వర్యాన

నెల్లిమర్ల : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలంటే పాఠశాల స్థాయిలో అవగాహన అవసరమన్నారు. రాజ్యాంగ విలువలు ఇప్పటి నుండి అలవరుచుకొని భావి భారత పౌరులుగా దేశానికీ, సామాన్య ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, జెవివి ఉపాధ్యక్షులు మురళి బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గంట్యాడ, రాజాం, విజయనగరంరూరల్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తత ప్రచారం నిర్వహించేందుకు రూపొందించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర శనివారం జిల్లాలో ప్రారంభమయ్యింది. దీనికోసం జిల్లాకు ఆరు అత్యాధునిక ప్రచార రథాలు రాగా, ఇవి తొలిరోజు రాజాం మండలం అంటకాపల్లి, విఆర్ అగ్రహారం, ఎస్.కోట మండలం సీతారామపురం, రేవళ్లపాలెం, విజయనగరం మండలం బియ్యాలపేట, ముడిదాం, నెల్లిమర్ల మండలం పారసాం, పెద బూరాడపేట, గంట్యాడ మండలం రామవరం, సిరిపురం, దత్తిరాజేరు మండలం భూపాలరాజపురం, టి.బూర్జవలసలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్ఇడి స్క్రీన్‌ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. విద్యార్థులు, స్థానిక కళాకారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు ఆలపించిన స్వచ్ఛత గీతాలను ప్రసారం చేశారు.

గంట్యాడ మండలంలో నిర్వహించిన యాత్రలో జిల్లా నోడల్ ఆఫీసర్, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, అర్హత ఉన్నవారందరికీ వీటిని అందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు ఆరు రథాలు వచ్చాయని, ఒక్కో రథం రోజుకు రెండు గ్రామాల్లో పర్యటిస్తుందని, మొత్తం ఆరు రూట్లను రూపొందించామని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి నోడల్ అధికారిగా, జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా, గ్రామ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ యాత్ర సందర్భంగా వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసినట్లు సిఇఒ వివరించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపిడిఒలు, ఇతర అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 1వ డివిజన్ నందిగుడ్డి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే దిశగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కోరారని, స్పందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి రూ.10 లక్షలు మంజూరు చేయించి సామాజిక భవన నిర్మాణానికి చొరవ చూపారని అన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్ మాట్లాడుతూ తమ డివిజన్ గతం కంటే ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు ముచ్చు శ్రీనివాసరావు, ముద్దాడ మధు, డివిజన్ ఇంఛార్జి దాసు తదితరులు పాల్గొన్నారు.

కాళికాదేవి బోనాలు ఉత్సవంలో కోలగట్ల

దాసన్నపేట ప్రాంతంలో కొలువైన కాళికాదేవి బోనాల ఉత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. నిర్వహకులు శ్రీను కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, ఆలయ కమిటీ ప్రతినిధులు పొంతపల్లి గోపి, బోడసింగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కోలగట్ల

నగరపాలక సంస్థకు ఆనంద గజపతి ఆడిటోరియం బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆనందగజపతి ఆడిటోరియం నిర్వహణ బాధ్యతలను నగరపాలక సంస్థకు అప్పగిస్తూ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆనంద గజపతి ఆడిటోరియం పరిసరాలను కమిషనర్ ఆర్. శ్రీరాములు నాయుడు శనివారం పరిశీలించారు. ఇంఛార్జి ఇఇ దక్షిణామూర్తి, డిఇలు, ఎఇలతో కలిసి ఆనంద గజపతి ఆడిటోరియం లో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఆనంద గజపతి ఆడిటోరియం నిర్వహణ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి చర్యలు చేపడతామని వెల్లడించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మీసేవ కేంద్రాన్ని పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న మీసేవ కేంద్రాన్ని రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తూ తద్వారా రీడింగ్ రూమ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నగర సుందరీకరణకు విఘాతం కలిగిస్తే చర్యలు

నగర సుందరీకరణకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యనైనా సహించబోమని కమిషనర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ఇష్టారాజ్యంగా డివైడర్లు, ఇతర ప్రైవేటు, ప్రభుత్వ గోడల పైన పోస్టర్లు, కరపత్రాలు, గోడ పత్రికలు అతికిస్తూ, నినాదాలతో కూడిన రాతలను రాస్తూ నగర సుందరీకరణకు విఘాతం కలిగిస్తున్నట్లు గమనించామన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1వ తేదీ నాటికి సదరు గోడపత్రికలను, కరపత్రాలను, గోడ రాతలను స్వచ్ఛందంగా తొలగించాలని తెలిపారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పదివేల రూపాయలు అపరాద రుసుం విధిస్తామని తెలిపారు.

నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ ప్రక్రియలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నంలో జెకె క్రెడాయ్ సంస్థ మరో అడుగు ముందుకు వేసింది. ప్రాపర్టీ ఎక్స్‌పో పేరిట నగరంలోని లీ పారడైజ్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు భారీ ప్రదర్శనను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిందని క్రెడాయ్ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. శనివారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించాఉ ప్రతిఏటా ప్రాపర్టీ ఎక్స్ పో పేరిట ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 250 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. 75 మంది భవన నిర్మాణ సంస్థలకు చెందిన ప్రతినిధులు, బ్యాంకర్లు పాల్గొంటున్నారని చెప్పారు. కొత్తగా ఇల్లు నిర్మించుకొనే వారు తాము ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనకు వచ్చినట్లయితే భవన నిర్మాణాలపై సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. నగర ప్రజలంతా విచ్చేసి ప్రజలందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 16 వరకు జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 581 క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలందించిన సిబ్బందిని శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి.గౌరీశంకర్రావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించిన వైద్యులు, సిబ్బందిని అభినందించారు. అనంరం డిఎంహెచ్ఒను, నెట్ వర్క్ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ అప్పలరాజును సన్మానించారు.కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

సర్వజన ఆసుపత్రి ఆవరణలో 108 సిబ్బందికి గత 2 రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. 108 సంస్థ లో పనిచేస్తున్న సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా జిల్లా మేనేజర్ నాజీర్ హుస్సేన్ సమక్షంలో శనివారం అవగాహన కల్పించారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి డివిజన్ ఒఇడిటి రవి కుమార్, ఉపేంద్ర, సాయిసణ్ముఖ్ పర్యవేక్షణలో గుండె జబ్బులను ముందు గానే గుర్తిచడం, గర్భిణులను ప్రసవ సమయంలో ఎలా సంసిద్ధత చేయాలి, శిశు రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

మౌనం వెనుక మర్మమేమిటో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మౌనం అర్ధ అంగీకారం అంటారు పెద్దలు. మేధావులు, ప్రజాప్రతినిధుల మౌనం సమాజానికి చేటని కూడా మరికొంతమంది చెబుతుంటారు. తాజాగా అటువంటి సూక్తులు, నీతి వాక్యాలే గుర్తు చేస్తున్నారు జిల్లా ప్రజానీకం. అపరిచిత వ్యక్తి ప్రభుత్వ పథకాలపై సమీక్షలు చేస్తుంటే జిల్లా ఉన్నతాధికారిగానీ, ప్రజాప్రతినిధులు గానీ నోరు మెదపకపోవడం వెనుక మర్మమేమిటో? అన్నది పబ్లిక్ టాక్. ఈనెల 21, 22 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ అపరిచత వ్యక్తి క్షేత్ర స్థాయి పరిశీలనకు రావడంతోపాటు ప్రభుత్వ పథకాలపై సమీక్ష చేసిన సంగతి తెలిసిందే. ఉపాధి హామీ పనులు చేపట్టిన మట్టి పనులు మొదలుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాలు, ఏజెన్సీలో చెక్‌డ్యాంల నిర్మాణ అవసరాల వరకు ఆరా తీయడం, రెండో రోజు పార్వతీపురం జిల్లా పర్యటన ముందుగా అనుకున్న షెడ్యూల్ మార్పుచేయడం, మీడియా కంటపడకుండా జాగ్రత్తలు వహించడం, ఇందుకు అధికారులు కూడా సహకరించడం చర్చనీయాంశంగా మారింది. మమూలుగా ఆలోచిస్తే ఎవరో జిల్లాలకు వచ్చి వెళ్లారని భావించవచ్చుని, ఆ అపరిచిత వ్యక్తి అధికారిక సమీక్షలు, ఆపై అత్యంత గోప్యత ప్రదర్శించడం వెనుక ఏదో ఎవరి ప్రమేయమో ఉండే ఉంటుందని జనం చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం నడిచి నాలుగు రోజులు కావచ్చినా జిల్లా సర్వోన్నత అధికారిగానీ, జిల్లాకు చెందిన



ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవం పట్ల జనం విస్తుపోతున్నారు. చివరకు డ్వామా పీడీ కూడా నోరు మెదపడం లేదు. అపరిచిత, అనధికార పర్యవేక్షణపై తీగలాగితే.... డొంక కదిలిన చందంగా బయటపడుతుంది. కానీ, ఆ తీగ లాగేందుకు ఎందుకు సాహించడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకుందంటూ కొందరు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు తెలియకుండా రాష్ట్ర స్థాయి అధికారులెవరైనా ఇటువంటి నాటకానికి తెరలేపారా? అన్న సందేహాలు, ఊహాగానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. ఈనేపథ్యంలో ఆ అపరిచత వ్యక్తి పరిశీలించిన అమృత్ సరోవర, మొక్కలు పెంపకం, ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల మంజూరు, నిర్మాణాల పట్ల జనమే ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరముందని జనం చర్చించుకుంటున్నారు. చెప్పినట్టుగా చేయలేకపోతేనే సంబంధిత అధికారులు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తున్న ఉన్నతాధికారులు దీనిపై ఎందుకు స్పందించడం లేదన్నది సాక్షాత్తు కొంతమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నోట వినిపిస్తున్న మాట. దీన్ని ఇలాగే వదిలేస్తే అజ్ఞాత నాటకంలో అపరిచితుల పెత్తనం పెచ్చుమీరుపోయే ప్రమాదం లేకపోలేదని కూడా చర్చనడుస్తోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి దృష్టిలో ఉండకపోవచ్చు. తెలిస్తే సంబంధిత వ్యక్తులకు తాట తీసినంత పనే చేస్తారని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ ఇప్పుడు స్పందించకపోతే, ఎప్పటికైనా నాటకీయ పరిణామాలు బయటపడతాయని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ పటిష్టతకు మరింత కృషి : సువ్వాడ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రవిశేఖర్ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

నియోజక వర్గం లో టిడిపి పటిష్టతకు మరింత కృషి చేస్తానని టిడిపి సీనియర్ నాయకులు, సువ్వాడ రవి శేఖర్ అన్నారు. శనివారం టిడిపి అధిష్టానం నియోజవర్గ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గా మరో బాధ్యతను ఆయనకు అప్పగించడంతో టిడిపి నాయకులు ఆయన్ను తన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సువ్వాడ రవి శేఖర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. రవిశేఖర్ ను సత్కరించిన వారిలో నగర పంచాయతీ క్లస్టర్ ఇంచార్జ్ అట్టాడ శ్రీధర్ (బుజ్జి), పద్మశాలి జిల్లా కన్వీనర్ వాసపల్లి వీరభద్రరావు, సీతారామునిపేట గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షులు దన్నాన శ్రీరామ్, నగర పంచాయతీ రైతు సంఘం అధ్యక్షులు కలిశెట్టి శ్రీను, సతివాడ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి రెల్లి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి గొంప పరామర్శ

జామి: మండలంలోని జాగారం గ్రామానికి చెందిన కరక అప్పలనాయుడు గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ శనివారం కరక అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ నాయుడు కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందన్నారు. అనంతరం అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, రెడ్డి పైడిబాబు, జామి మాజీ సర్పంచ్ ఇప్పక త్రివేణి, రాయవరపు శంకర్, మాదిబోయిన మంగరాజు, రామకృష్ణ, దండుపాటి ఎర్రినాయుడు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభను జయప్రదం చేయండి

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లడుతూ వచ్చే నెల 16,17 తేదీల్లో ఉద్యమాల గడ్డ నెల్లిమర్లలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో ఎన్నుకోబడిన ప్రతినిధులు 250 మంది వస్తారని, మహాసభ మొదటి రోజు విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. నూతన నాయకత్వాన్ని ఈ మహాసభల్లోనే ఎన్నుకుంటారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె. రవి కుమార్, నాయకులు జితేంద్ర, గణేష్, శివ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్కు ఆమోదం

గంట్యాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిపి పీరుబండి హైమావతి అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్ను, 2024-2025 సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెటఖపె సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు సవరణ అంచనా బడ్జెట్లను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి వరి నరసింహమూర్తి, వైస్ ఎంపిపి కిలపర్తి వెంకటలక్ష్మి, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఎంపిడిఒ వై. భవాని, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మి నరసింహం శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, రెండో విడత గృహ నిర్మాణాలు ప్రవేశాలకు వేగవంతం చేయాలని, నాడు నేడు నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బిఎస్కెఎన్ పట్నాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

లక్కవరపుకోట: మండల శాఖ గ్రంథాలయానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ సుమారు రూ. 20 వేలు విలువ చేసే పోటీ పరీక్ష పుస్తకాలను శనివారం వితరణ చేశారు. వీటిలో గ్రూప్ 1, 2, ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్, డిఎస్సి మొదలగు పుస్తకాలను లైబ్రరియన్ బి మేరీనిర్మలకు అందజేశారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులు కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమవ్వడానికి ఈ పుస్తకాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఆదారి రమేష్, మాదిబోయిన మంగరాజు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాసరావు, మండా త్రినాధ్, ముక్కా రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

రేగిడి: నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని, అందుకు వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాల్లో రైతుల నుంచి రిజిస్ట్రేషన్ చేయించాలని ఎఒ మురళీ కృష్ణ, సిఎస్డిటి కామేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బంది, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లతో ధాన్యం కొనుగోలు, నాణ్యత, తేమ వంటి వాటిపై శిక్షణ జిల్లా వ్యవసాయ టీమ్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర సాధారణ రకానికి 2,183 రూపాయలు, గ్రేడ్ ఏ రకానికి 2,203 రూపాయలు ప్రకటించిందని తెలిపారు.. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసేందుకు మద్దతు ధర వెల్లడించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆన్లైన్ పద్ధతిలో స్క్రీన్ పై అవగాహన కల్పించారు.

నియామక పత్రాలు అందజేత

గంట్యాడ: మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలలో కొత్తగా ఎంపికైన వాలంటరీలకు మండల కార్యాలయంలో ఎంపిపి పీరుబండి హైమావతి శనివారం నియామక పత్రాలను అందజేశారు. రామవరం పంచాయతీ నుండి బోనాలు హిందూ, గుడియాడ పంచాయతీ నుండి చప్ప వెంకట సత్యవతి, పెదవేమల పంచాయతీ నుండి ఎస్ అరుణ, కొర్ల పంచాయతీ నుండి లగుడు జయంతి, కొత్తగా ఎంపికైనట్లు తెలిపారు. జెడ్పిటిసి వరి నరసింహమూర్తి, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం విఫలం

బొబ్బిలి: అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. సామాజిక సాధికార బస్సుయాత్రలో ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. బస్సుయాత్ర వైసిపి కార్యక్రమమైనప్పటికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. బొబ్బిలిలో జరిగిన బస్సుయాత్ర సభ విఫలమైందని విమర్శించారు.ఆయనతో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, పి.రాజు ఉన్నారు.

సకాలంలో సరుకులు అందజేయాలి

బొబ్బిలిరూరల్ : లబ్దిదార్లకు సకాలంలో సరుకులు అందజేయాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో డీలర్లు, డియంఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లంతా సకాలంలో సరుకులు తీసుకొని డియంఎ ఆపరేటర్లకు అందజేయాలని వారంతా సకాలంలో సరుకుల లబ్ది దార్లకు పంపిణీ చేయాలని సూచించారు. డీలర్లు, యండిఎ ఆపరేటర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్డిటి ఆర్.సాయికృష్ణ, డీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

బహుళ పంటలతో అధిక ఆదాయం

గుర్ల: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎటిఎం మోడల్ విధానంలో బహుళ పంటలతో అధిక ఆదాయం వస్తుందని ఉత్తర కోస్తా రీజనల్ అధికారులు ప్రకాష్ రావు, హేమ సుందర్ వివరించారు. శనివారం జమ్ముపేటలో లండా దుర్గారావు పొలంలో కూరగాయలు పంటలతో ఎటిఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ రైతులకు, వ్యవసాయ అధికారులు వివరించి ఎటిఎం మోడల్లో ఒక బెడ్ వెడల్పు నాలుగడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతి ముల్లంగి, బీట్రూట్, క్యారెట్, కాయగూరలు వంగ, టమాట, మిరప, చిక్కుడు, గోరుచిక్కుడు, అనుములు అలసందలు, బెండ ఆకుకూరలు కొలతల ప్రకారం వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరకొస్తా రీజనల్ అధికారులు, సర్పంచ్ వరలక్ష్మి, జమ్ముపేట సొసైటీ చైర్మన్ పురం శ్రీనివాస్ రావు, ఎఒ తిరుపతిరావు, విహెచ్ఎ శంకరావు, సీతా మహాలక్ష్మి, సంగమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ సత్యనారయణ, సూర్యకుమారి, శ్రీనివాసరావు, సంతోషి, దుర్గ, లక్ష్మి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - గంట్యాడ

మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న హింశలకు వ్యతిరేకంగా మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం వైకెపి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మహిళా మండల కార్యాలయం నుండి కొటారుబిల్లి గ్రామం వరకూ ర్యాలీ చేసి కొటారుబిల్లి కూడలిలో మానవహారం నిర్వహించారు. మహిళలకు, చిన్నపిల్లలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసపైన నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాసరావు, ఎఫ్సిఒ ఎపిఎం సైలెన్, సిసిలు చినబాబు, అచ్చింనాయుడు, ముత్యాల నాయుడు, గౌరీశ్వరి, విఒలు, స్వయం పాల్గొన్నారు. **రేగిడి:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎపిఎం గోవిందరావు, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కాంప్లెక్స్లో వెలుగు కార్యాలయం నుంచి జెండర్ ఆధారిత అహింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్ల దాటిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే మరణాలు సంభవించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మండల మహిళా సంఘం, విఒఎలు పాల్గొన్నారు. **గుర్ల :** డ్వాక్రా సంఘాలు లింగ వివక్షపై అవగాహన కల్పించాలని ఎపిఎం నారాయణరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 22 వరకు లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామన్నారు. నెల రోజుల పాటు స్వయం సహాయక సంఘాలు, కళశాలల్లో అవగాహన కల్పించాలని సూచించారు. **డెంకాడ:** స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద శనివారం లింగ వివక్షకు వ్యతిరేకంగా వైకెపి ఆధ్వర్యంలో మహిళలు, కళశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ విజయలక్ష్మి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆర్వి.రామమూర్తి, ఎన్జిఒ సంస్థ శివ శంకర్ పాల్గొన్నారు. **భోగాపురం:** జెండర్ హింసకు వ్యతిరేకంగా భోగాపురం మండల సమైక్య ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో వైసిపి మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్య నారాయణ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ శివారెడ్డి, వెలుగు ఎపిఎం రమణ, ఎంపిడిఒ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి సత్యవతి, తహశీల్దార్ చింతాడ బంగార్రాజు పాల్గొన్నారు.

భోగాపురం: ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

'సీతం'లో ఘనంగా ఫ్రెషర్స్డే వేడుకలు

విజయనగరం : స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ-పిజి కళాశాలలో శనివారం ఫ్రెషర్స్డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఎఎస్పి (అడ్మిన్) ఆస్మా ఫర్హీన్, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎంవి సాయి దేవ మణి కళాశాలలో అందిస్తున్న సౌకర్యాల గురించి, విద్యార్థులు ఈ మూడేళ్లలో ఏ విధంగా తమ కెరీర్ను అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి విద్యార్థులు బాగా చదివి జ్ఞానవంతులు గాను విలువలతో కూడిన విద్య నేర్చుకొని తేజోవంతులుగాను తయారు కావాలని ఆకాంక్షించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని అందుకు అనుగుణంగా చదవాలని కోరారు. ఎఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు లోనూ కాకుండా కెరీర్ పై దృష్టి పెట్టాలని సూచించారు. మొబైల్ ద్వారా ప్రయోజనం పొందాలి గాని దాని వలన నష్టం లేకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం గేమ్స్, స్పోర్ట్ లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కరస్పాండెంట్ డాక్టర్ శశి భూషణరావు ఇటీవల జెఎన్టియు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎఎస్పి

సమస్యలపై అధికారులు స్పందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామాల్లోని సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కనెక్షన్లు ఉన్న ట్రాన్సఫార్మరు మరమ్మత్తులకు గురై 40 రోజులు గడుస్తున్నాసరే ఇప్పటి వరకు కొత్తది వేయలేదని ఆశాఖ ఎఇ మస్తాన్వలీని ముంజేరు సర్పంచ్ పూడి నూక రాజు ప్రశ్నించారు. గ్రామాల్లోకి స్పెషల్ స్క్వాడ్ అధికారులు వచ్చి ఇళ్లల్లో ఫ్రిజ్లు, మోటార్లు ఉన్నాయని వేళల్లో జరిమానాలు వేస్తున్నారని రావాడ సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు అన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నా రు.అంగన్వాడీ కేంద్రాలకు కుళ్ళిన కోడి గుడ్లు వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఐసిడిఎస్ పిడి ఎస్తేరు రాణి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను అంగన్వాడీ కార్యకర్తలు తనదృష్టికి తీసుకువచ్చారని దీనిపై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ముక్కాం వెళ్లే రహదారిలో ముంజేరు సచివాలయం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఆ గ్రామ సర్పంచ్ ఆర్ అండ్ బి జె.ఇని కోరారు. అనంతరం మండలపరిషత్ పరిపాలనా అధికారి బంగారయ్య బడ్జెట్ను సభ్యులకు చదివి వినిపించగా వారంతా ఆమోదించారు. ఈ సమావేశానికి టిడిపి ఎంపిటిసిలు ఎవరూ హాజరుకాలేదు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, తహశీల్దారు చింతాడ బంగార్రాజు, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, వైస్ ఎంపిపి పడాల సత్యవతి, డి.ఇ బంగారు నాయుడు, వైద్యధికారి తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జగనన్న ఇళ్ళు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ జిల్లా అధికారి వి. శ్రీనివాస్ సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా నగర పంచాయతీ పరిధి పంప్ హౌస్ వద్ద జగనన్న కాలనీని హౌసింగ్ అధికార్లు పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పంప్ హౌస్ వద్ద 77ఇళ్లు మంజూరవ్వగా ఇంతవరకు 57ఇళ్లు పూర్తి చేసినట్లు గుర్తించామన్నారు. మిగతా 18ఇళ్లు రెండు వారాల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఇ జి. మురళి మోహన్, ఎఇ ఆర్. పవన్, వార్డు ఏమినిటీస్ అలేఖ్య, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు. **గంట్యాడ :** జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ డిఇ రంగారావు అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం నందం గ్రామంలోని జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ పూర్తిగా నిర్మాణాలు ప్రారంభించని వారు ఉన్నారని, త్వరగా పూర్తి చేయకపోతే రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల గృహ నిర్మాణ శాఖ అధికారి రాజ గోపాలరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** మున్సిపాలిటీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని కరకవలసలో శనివారం ప్రత్యేకాదికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్కెఎన్ పట్నాయక్, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అకాల వర్షాల వల్ల రైతుకు అపార నష్టం వాటిల్లిందని పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో వర్షం కారణంగా పాడైన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాల వల్ల నీటిపాలవుతోందని ఒక్క వెంకటరమణ పేట గ్రామంలోనే సుమారు 20 ఎకరాలకు పైగా వరి పంట పూర్తిగా నీటమునిగి పంట నీళ్లలోనే ఉండడంతో వడ్లు మొలకెత్తాయని చెప్పారు. ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చు పెట్టి వరి పంట సాగు చేశారని, తీరా పంట చేతికొచ్చే దశలో పంటంతా పూర్తిగా మునిగిపోయి వడ్లు మొలకెత్తాయని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న వరి పంటను సచివాలయ వ్యవసాయాధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ సెక్రెటరీ జుత్తాడ రామసత్యం, పట్టణ చీఫ్ సెక్రటరీ ఆడారి రమేష్, టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు మాదిబోయిన మంగరాజు, నాయకులు గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాస్ రావు, మండా త్రినాధ్, శివ, ముక్క రామకృష్ణ, పాల్గొన్నారు.

నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న గొంప కృష్ణ, తదితరులు

వేపాడ : మండలంలోని పెద్ద కృష్ణరాజపురం గ్రామానికి చెందిన 20 ఎకరాలు పంట కోసిన తర్వాత వర్షం పడడంతో పూర్తిగా తడిసిపోయి మొలకెత్తి, కుళ్ళిపోయింది. నీటిలో మునిగిన పంటను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ శనివారం పరిశీలించారు. పంట నష్టపరిహారం రైతులకు వచ్చేలా కృషి చేస్తానని ఆయన రైతులకు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, బాణాది ఎంపిటిసి గొంప తులసి, నాయకులు సేనాపతి గణేష్, రామకృష్ణ, జి నాగరాజు, అప్పలనాయుడు, గుమ్మడి రాంబాబు, రామన్న దొర, రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో శుక్రవారం రాత్రి యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం కొండలరావు అధ్యక్షతన జరిగిన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి రమణ, ఎన్నికల పరిశీలకులుగా జి రాజారావు వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్షులుగా విఇ సత్యనారాయణ, విఎస్ దేముడు, మండల అధ్యక్షులుగా ఎంవిఎఎస్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎ.రాము, ఇతర కార్యవర్గ సభ్యులను జిల్లా కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం సీనియర్ నాయకులు గునూరు వెంకటరావు మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్తు కార్యాచరణ పోరాటాలలో జిల్లా, రాష్ట్ర పిలుపు మేరకు అందరూ పాల్గొని కార్యవర్గ సభ్యులంతా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది పాల్గొన్నారు.

రేగిడి: మండల యుటిఎఫ్ అధ్యక్షులుగా గురవాన విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం బూరాడ ప్రాథమికోన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల సమావేశం ఏర్పాటు చేసి, కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి.రామినాయుడు ఎన్నికల అధికారిగా, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు పరిశీలకునిగా వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్షుడుగా మురపాక గణేష్, అధ్యక్షులుగా గురవాన విష్ణుమూర్తి, సహ అధ్యక్షులుగా బి.విజయమ్మ, బి.వి.గనేశ్వరరావులు, ప్రధాన కార్యదర్శిగా వారాడ సత్యం నాయుడు, కోశాధికారిగా వారణాసి ప్రవీణ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా చుక్క వైకుంటరావు, గార రాంబాబు, వై.కిషోర్, జి.రాంకుమార్, డి.రామారావు, కె.చంద్రశేఖర్, ఆర్.సంగం నాయుడు, కిమిడి గౌరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాధర్నాకు అన్నదాతలు కదలిరావాలి

ప్రజాశక్తి - జామి

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలనే లక్ష్యం ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడ జింకానా గ్రౌండ్లో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు కదలిరావాలని రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధరాజు రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని వెన్నేపాడు గ్రామంలో మహా ధర్నా పోస్టర్ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సాగు ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించడంతో పాటు దానికి చట్టబద్ధత కల్పించాలన్నారు. కౌలు రైతులకు, రైతాంగానికి వ్యవసాయ రుణాలు అందించాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా కౌలు రైతు రున ఉపశమన చట్టంకు పార్లమెంటులో ఆమోదం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, రైతు సంఘం నాయకులు రాయవరపు సత్యం, రైతులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** ఈనెల 27 28 తేదీలలో విజయవాడలో నిర్వహించే కార్మిక రైతు మహాధర్నాకు తరలిరావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రైతు బజార్ వద్ద గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాల ఆరు నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యులు గేదెల శ్రీను, రైతు సంఘం సభ్యులు పి శ్రీను, పి హరి, టి నాగమణి, పి బంగారయ్య, పి రామకృష్ణ పాల్గొన్నారు. **భోగాపురం:** ఆలిండియా కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో జరగబోయే 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ అన్నారు. భోగాపురం గ్రామంలోని ముక్కాం వెళ్లే ఆటో స్టాండ్ వద్ద ధర్నాకు సంబంధించిన పోస్టర్ను శనివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ధరలను అదుపులోకి తీసుకువచ్చి ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు.ఆటో యూనియన్ అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు ఎం.రవి, అప్పారావు, పిట్టా రామసూరి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉన్నాం

పూసపాటిరేగ: మత్స్యకారులను ఆదుకుంటుంది ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని చింతపల్లి-1 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడు తూ విశాఖలో మత్స్యకారులకు జరిగిన ఆపదపై సిఎం స్పందించిన సంగతి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, వైస్ ఎంపిపిలు ఎన్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, నాయకులు మహంతి జనార్ధనరావు, సర్పంచ్ బర్రి ముసలి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాలి

వంగర: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిలో సామర్థ్యాలు మెరుగుపడాలని డిప్యూటీ డిఇఒ పి బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని ఎం. సీతారాంపురం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వంగరలోగల కెజిబివి విద్యాలయాన్ని ఆయన శనివారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.

చీరలు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

సామాజిక సేవ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

ప్రతి ఉద్యోగి సామాజిక సేవ చెయ్యాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తాను ఏర్పాటు చేసిన మెర్సీ వాల్ వద్ద విఆర్ఒ అప్పారావు కుమారుడు పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఆయన చేతులు మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పేద పిల్లల చదువులకు, వారి జీవనోపాధి మెరుగు పడే విధంగా ముందుకు రావాలన్నారు. దీని వలన వారికి పని వత్తిడి తగ్గి ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్డిటి సాయికృష్ణ, ఆర్ఐ కళ్యాణ్చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ రీచ్ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి- తెర్లాం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ శనివారం సిటిజెన్ అవుట్ రీచ్ సర్వే, పిఎంజెఎవై కార్డుల మంజూరు, సచివాలయాల నిర్వహణ, బయోమెట్రిక్ హాజరు, చెత్త నుండి సంపద కేంద్రాలు, పారిశుద్యం, తాగునీటి సరఫరా, గడప గడపకి మన ప్రభుత్వంలో మంజూరు అయిన పనులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, గ్రీన్ అంబాసిడర్ జీతాలు, ఉపాధిహామీ పనుల పరిశీలన, డిజిటల్ చెల్లింపులు పై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిజెన్ అవుట్ రీచ్ సర్వేలో క్లస్టర్ అనుసంధానం అయిన సచివాలయ ఉద్యోగి తప్పక హాజరయి సర్వే పూర్తిచే యాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ జీతాలు సకాలంలో సర్పంచులతో మాట్లాడి చెల్లించాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి- బాడంగి

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కోడూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి బాబు ఆధ్వర్యంలో జిల్లా కొప్పల వెలమ కన్వీనర్ అప్పలనాయుడు నిర్వహించరు. ఈ సందర్భంగా నాయకులు మినీ మేనిఫెస్టోలోని విషయాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకుల సత్యం, కొల్లి చిన్నం నాయుడు, బాత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైకిరిపై కార్మికుల మండిపాటు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రభుత్వ వైఖరిపై కార్మికులు మండిపడ్డారు. ఈ మేరకు సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, రాడ్ బెండింగ్ కార్మికులు, కార్పెంటర్, ప్లంబర్స్ తదితరులు మండలంలోని గవరవీది, జామివీధి, బిసి కోలని తదితర ప్రాంతాలలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా శనివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ ఆయాంలో ప్రతి భవన నిర్మాణ కార్మికులకు రూ. 10 వేలు, కార్మికుల కుమార్తె వివాహానికి రూ. 20 వేలు, కాన్పులకు రూ. 30 వేలు, సహజ మరణానికి రూ. 80వేలు ఇచ్చేవారన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ. 2 లక్షలు ఇచ్చేవారని తెలిపారు. ఆ విధానాన్ని ఇప్పటి ప్రభుత్వం అమలు చేయకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఈ సమస్యలపై చెరుకు కాటా వద్ద డిసెంబర్ 2న సమావేశం నిర్వహిస్తామని ఈ సమావేశానికి సకాలంలో కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల శాఖ అధ్యక్షులు తరిణి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మికులు జామి శ్రీరామ్, జామి గణేష్, కోళ్ల సత్తిబాబు, వెంకటరావు, అప్పలరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పట్నాన సత్యన్నారాయణ ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ (పరుగుల) పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. సత్యనారాయణ విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని శ్రీరాములు తెలిపారు. ఎంపికైన క్రీడాకారుడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉప ప్రదానోపాద్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ లోకిరెడ్డి కృష్ణ, రహీం షేక్ లాల్, పొట్నూరు శివాజీ, సబ్బావరపు సతీష్, తమ్మినేని రాజేష్ తదితరులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రామభద్రపురం

జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం టిట్లాఘర్కు చెందిన సుచిత్ కుమార్ పానిగ్రహి (54) మెడికల్ చెకప్ కోసం విశాఖకు కారులో డ్రైవర్తో కలిసి వెళుతుండగా ఆరికతోట ఆంజనేయ స్వామి గుడికి సమీపంలో ముందు వెలుతున్న లారీని అదిగమించే క్రమంలో ఎదురుగా వాహనం వస్తుండడంతో అదే లారీని ఢీ కొట్టాడు. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చున్న సుచిత్ కుమార్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్ రాజేష్ పివి నాయర్ స్వల్ప గాయాలతో బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు. మృత దేహాన్ని బాడంగి సిహెచ్సికి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి - గజపతినగరం

రెండు లారీలు వెనుక నుండి ఢీకొన్న సంఘటన శుక్రవారం రాత్రి మరుపల్లి సమీపంలో జరిగిందని ఎస్ఐ సిహెచ్ గంగరాజు తెలిపారు. నాగాలాండ్ రిజిస్ట్రేషన్ కలిగిన లారీలో డ్రైవర్గా పనిచేస్తున్న బబ్లు యాదవ్ అనే వ్యక్తి వాహనం కింద రిపేరు చేస్తుండగా వెనక నుండి మరో లారీ బలంగా ఢీ కొనడంతో లారీ చక్రాల కింద డ్రైవర్ నలిగి పోయాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రస్పత్రికి తరలించిన అనంతరం అతను అక్కడ చనిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు మృత్యువాత

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలో కొరటాం అప్పన్న చెరువులో పడి బలిజిపేట మండలం నూకలవాడ గ్రామానికి చెందిన వేగోటి రాములు(63) పడి మృతి చెందాడు. తన అక్క ఇంటికి వచ్చిన రాములు శనివారం అప్పన్న చెరువులోకి స్నానానికి దిగి, చెరువులోతు ఎక్కువుగా ఉన్నందున, ఈత రాక మునిగిపోయి మృతి చెందాడు. మృతినికి భార్య, కుమారుడు వున్నారు. స్థానికి ఎస్ఐ ఆర్ రమేష్ కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి, పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని బాడంగి సిహెచ్సికి తరలించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం సర్కిల్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పి దీపిక పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ఆధ్వర్యంలో మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఆంధ్ర పోలీసు స్టేషన్కు చెందిన 416, బొండపల్లి 37, గజపతినగరం 216, బూర్జవలస 45 మద్యం బాటిల్లను స్టేషన్ హౌస్ ఆఫీసర్ సమక్షంలో ధ్వంసం చేశారు.